

# ఋణం

## ఎమ్.హరి

"మీకు గుంటూరు నుంచి ట్రంక్ కాల్ వచ్చింది సార్" అని ప్యూన్ చెప్పగానే, ఎవరు చేసివుంటారు చెప్మా అని కేశవరావు ఆలోచిస్తూ సీట్లోంచి లేచి "వొక్క క్షణం ... ఇప్పుడేవస్తాను" అంటూ తన ఎదుట కూర్చున యాదగిరికి చెబుతూ మేనేజర్ గదిలోకి వెళ్లాడు.

"హలో కేశవరావు స్పీకింగ్" అంటూ రిసీవర్ అందుకున్నాడు.

"పెద్దన్నయ్యా ... నువ్వేనా మాట్లాడేది ... నేనేరా గోవిందాన్ని ... అవున్రా అర్జంట్‌గా ఫోన్ చేయవలసిన అవసరం వచ్చింది. నాన్నకి లాటరీలో పదీ లక్షల ప్రైజ్ వచ్చింది ... నువ్విక్కడకి వస్తే అన్ని విషయాలు తెలుస్తాయి. లాటరీ టికెట్ ఆఁ పది లక్షలు ... ఆఁ బొంబాయి వెళ్ళాలి. నువ్వు వెంటనే రావాలిరా. పది లక్షల విషయం తెలిసీ తెలియగానే మన పెద్దబావగారు తనకి పదేళ్ళ క్రితం రావలసిన కట్నకానుకల వివరాలు ఏకరువు పెడుతూ వాటికి వడ్డీలు కడుతూ ఇక్కడే తిష్ఠవేశారు. ఇక మన రెండో బావగారు తండ్రి స్వార్జితంలో కొడుకులతో సమానంగా కూతుళ్ళకి హక్కువుందని వాదిస్తున్నారు. నాకంతా అయోమయంగావుంది. నేనిప్పుడు ఇక్కడే వున్నాను. నువ్వు వెంటనే రావాలి ... రేపటికల్లా వచ్చేయ్."

తమ్ముడి మాటలతో వొక క్షణ కాలం చలన రహితుడైనాడు కేశవరావు. సాలోచనగా రిసీవర్ పెట్టేసి "సార్ నేను అర్జంట్‌గా గుంటూరు వెళ్ళాలి... మా నాన్నగారు నన్ను చూడా లంటున్నారుట... పెద్దవయస్సుగా..." అంటూ మాటల్ని నాన్చేస్తూ శెలవు చీటీ గీకేసి మేనేజర్‌కిచ్చేసి గబగబా తన సీటు దగ్గరకి వచ్చాడు. ఆఫీసు జనాభాని పోగేసి తన యింటి గొప్పతనాన్ని అభినయ పూర్వకంగా వర్ణిస్తున్న యాదగిరిని చూడగానే అతనికి వొళ్ళు మండింది.

"యాదగిరిగారూ... మీ యింటిని గురించి యిక పదిమందికి చెప్పవలసిన పనిలేదు. మీ యింటిని నేనే కొంటాను. నాక్కొంచెం వ్యవధి కావాలి—" అంటూ యాదగిరిని రోడ్డుమీదికి తీసుకువచ్చాడు కేశవరావు. యాదగిరి ముఖంపై రంగులు మారుతున్నాయి. కేశవరావు తాపీగా సిగరెట్ వెలిగించి "నాకిప్పుడే ఫోన్ వచ్చింది. ఈ రాత్రికి గుంటూరు వెళ్ళాలి... అనుకోకుండా మా బంధువుల ఆస్తి నాకు కలిసివచ్చింది. వొక నెల రోజుల లోపల మీ యిల్లుని నేనే కొంటాను" అంటూ ఆగాడు.

"కేశవరావుగారూ... నెల రోజులు ఆగడం కష్టమండి. నేను మీకైతే యనభైకి యిస్తానన్నాను గానీ తొంభై వేలకి మా యిల్లుని కొనడానికి చాలామంది పోటీలు పడుతున్నారు. మీకు మాట

ఇచ్చాను గాబట్టి ఇసభై మీదే, నేనింకా వున్నాను. మీరేమో లేటు చేస్తున్నారు. ముందు అడ్వాన్సుగా పదివేలు ఇవ్వండి... కాగితాలు రాసుకుందాం –'' వ్యాపార ధోరణిలో మాట్లాడుతున్నాడు యాదగిరి.

ఆలోచిస్తున్నాడు కేశవరావు. చిక్కడపల్లి సెంటర్‌లో వుందా ఇల్లు. తాను వుంటూ అయిదు వందల అద్దె చాలా సులభంగా సంపాదించ వచ్చును. ఆఫీసులో లోన్ పెట్టి ఇతరత్రా అప్పులు చేసి ఆ ఇల్లుని కొనాలనుకున్నాడు. ఇప్పుడు అకస్మాత్తుగా లాటరీ డబ్బు రాబోతున్నది. ఎంత లేదన్నా తన షేరు రెండు లకారాలకి తగ్గదు. అడ్వాన్సు ఇచ్చేవరకు యాదగిరి ఆగేట్లుగా లేడు. తానేం చేయాలి? తల తాకట్టుపెట్టైనా అడ్వాన్సు ఇవ్వాలి... ఆ ఇల్లుని దక్కించుకోవాలి. ''యాదగిరిగారూ... సాయంకాలానికి పదివేలు ఇస్తాను. కాగితాలు అవీ రెడీగా వుంచండి'' అంటూ ఆఘమేఘాలమీద ఇంటికి వెళ్ళాడు.

ఇంటికి వెళ్ళీవెళ్ళగానే విషయాన్నంతా భార్యకి వివరించాడు. బాంక్ పాస్‌బుక్ తీసుకున్నాడు. తాకట్టు పెట్టడానికి భార్య నగలు అడిగాడు.

'పోస్ట్' అనే కేక రాబోయే లక్షలు గురించి చర్చించుకుంటున్న ఆ భార్యాభర్తలకి వినబడలేదు.

'మీ మీటర్ రీడింగ్ చూడాలి... మీ గాస్ స్టౌవ్ బాగుచేయాలా?... అయ్యగారు పంపించారు. రేషన్ కార్డూ డబ్బూ ఇవ్వండి... పంచదార తెస్తాను...' అని మాయమాటలతో మోసం చేసి చిల్లరమల్లర దొంగతనాలు చేసే దారినపోయే దానయ్య కంట్లో పడింది వీధి గేటు ముందున్న కార్డు. దానయ్య అనాలోచితంగా ఆ కార్డుని తీసి గబగబా చదివాడు—చిరంజీవి కేశవరావుని దీవించి మీ నాన్న వ్రాయునది... ఉభయ కుశలోపరి... నేను కొన్న లాటరీ టికెట్‌కి పది లక్షల ప్రైజ్ వచ్చింది. నా ఆరోగ్యం బాగా దెబ్బతింది. ఈ వయస్సులో బొంబాయి వెళ్ళి లాటరీ టికెట్‌ని కాష్ చేసే స్థితిలో లేను. నువ్వు వెంటనే రావలెను.



మాధవుడికి కూడా జాబు రాశాను. గోవిందు ఇక్కడే వున్నాడు...

దానయ్య మస్తిష్కం చాలా త్వరగా పనిచేసింది ఈ లాటరీ టికెట్‌ని తాను దక్కించుకుంటే... తన వొక్కడివల్లా అవుతుందా? అందులో తనకి గుంటూరు కొత్త... అక్కడ తన ఫ్రెండ్స్ కనబడకపోతారా... ముందీ కేశవరావుని ఫాలో చేయాలనుకుంటూ ఆ కార్డుని కిటికీలోంచి లోపలికి విసిరేశాడు.

*   *   *

''అరేయ్ ఋషి ... ఇదిగోరా నువ్వడిగిన అయిదువేలు. మా షాపు తాకట్టుపెట్టి తెచ్చాను. నన్నిక నీటముంచినా పాలముంచినా నీదే భారం –'' అంటూ గోవిందు డబ్బుని టీపాయ్‌మీద పెట్టాడు. అతనూ ఋషీ బాల్యస్నేహితులు. ఇద్దరికీ చదువు అంటలేదు. గోవిందుకి బెజవాడలో ఫ్యాన్సీ షాపు వుంది. ఋషి సినిమా రంగంలో సత్రకాయలా బ్రతుకుతున్నాడు.

''గోవిందూ! ఈ ప్రపంచంలో లాభసాటి వ్యాపారం సినిమా. నా దగ్గర కథా, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, పద్యాలు అన్నీ రెడీగావున్నాయి. ఈ అయిదువేలతో పత్రికా ప్రకటనలు ఇస్తాను. పైసా ఖర్చు లేకుండా నటీనటులు వస్తారు. నేనే డైరెక్టర్ని ... ఇక నీకు ఫిలిం ఖర్చు మినహాయించి ఇంకో ఖర్చువుండదు. మీ నాన్నగారి లాటరీ డబ్బు రాగానే షూటింగ్ ప్రారంభిద్దాము. జిల్లాలవారిగా అమ్మేద్దాం ... ఎలా వుంది నా అయిడియా'' అంటూ గడగడా విస్కీ తాగేశాడు ఋషి. అది హోటల్ రూం. ఫ్యాన్సీ గూడ్స్ వ్యాపారంతో విసిగిపోయిన గోవిందుకి సినిమాలు తీసి లక్షలకి లక్షలు సంపాదించాలనే పేరాశవుంది. తండ్రికి పది లక్షలు వస్తున్నాయని తెలిశాకా అతని నోరూ, కాలు వూరుకోలేదు. ఋషి వలలోపడ్డాడు చివరికి.

*   *   *

బ్యాంక్‌లో వున్న ఆరువేలు క్యాష్‌చేసి, నగల్ని నాలుగువేలకి తాకట్టు పెట్టి యాదగిరికి పదివేలు ఇచ్చాడు. నెల రోజులలోగా మిగతా పైకం ఇవ్వలేని పక్షంలో అడ్వాన్సుని వదులుకుంటానని కాగితం కూడా రాసిచ్చాడు కేశవరావు.

సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి తెల్లారకుండానే బెజవాడ చేరాడు. గుంటూరు ట్రైన్ కోసం ప్లాట్‌ఫారం మారుతూవుంటే అతని తమ్ముడు కుటుంబ సమేతంగా కనబడ్డాడు.

''మాధవా ... గుంటూరుకేనా? కాకినాడ నుంచేనా రావడం'' అంటూ ప్రశ్నించాడు కేశవరావు.

''ఓ ... నువ్వా అన్నయ్యా ... నాన్నగారి కెలా వుంది ... మా తోడల్లుడి మేనకోడలు పెళ్ళికోసం నాలుగురోజుల క్రితం బెజవాడ వచ్చాం ... ఇప్పుడు తిరుపతి వెళ్తున్నాం'' అన్నాడు మాధవ తన మామూలు ధోరణిలో.

పెళ్ళాం చేతిలో కీలుబొమ్మా, జీతం కన్నా పై ఆదాయం ఎక్కువని నాన్న మాధవకి ఉత్తరం రాయలేదా? ... అన్నట్లు వీళ్ళు కాకినాడని వదిలి నాలుగురోజులు దాటింది. వీళ్ళకి విషయం తెలిసి వుండదు. తానిప్పుడు పదిలక్షల విషయం చెప్పకపోతే రేపు అల్లరి పడవలసివస్తుంది. అందులో తన మరదలు నోరు మంచిదికాదు. ఆమె నోటికి భయపడి తాను గుంటూరు వెళ్తున్న కారణం వివరించాడు కేశవరావు.

''అయితే పదండి బావగారూ ... మేం కూడా వస్తాం –'' అంటూ అందుకుంది మాధవస్వామి శ్రీమతి.


''తిరుపతికి బయలుదేరాం ... ఆ స్వామికి కోపం వస్తుంది'' అంటూ నసిగాడు మాధవ. ఇప్పుడు గుంటూరు వెళ్తే అనవసరంగా డబ్బు ఖర్చు అవుతుంది. తాను వెళ్ళకపోయినా తన వాటా తనకి వస్తుంది. రాకపోతే భార్య నోరు వుంది, కోర్టులు వున్నాయి అని మనసులో తాను తర్జన భర్జన పడుతున్నాడు.

''పది లక్షలు మనచేతికి రాగానే ఆ స్వామికి మీ తలనీలాలూ, నిలువుదోపిడీ ఇస్తానని ఇందాకే మ్రొక్కుకున్నాను'' అంటూ భక్తిపారవశ్యంతో చేతులు జోడించి కళ్ళు మూసుకుంది.

''కొంప ముంచావుకదే ... నీ వొంటిమీద అయిదువేల నగలున్నాయి ... పిల్లలకి రెండువేల–'' అతని మాటలకి అడ్డువస్తూ ... ''తప్పు ... తప్పు .. అపరాధం క్షమించు స్వామి ... ఈ నగలు ఇచ్చినంత మాత్రాన మనమేం బీదవాళ్ళం కాము లెండి ... పదండి ... ట్రైన్‌కి టైమ్ అవుతోంది –'' అంటూ తొందర పెట్టింది అతని భార్య.

*   *   *

''బ్రాడీపేట నాల్గోలైను పన్నెండో అడ్డరోడ్డు'' అని మననం చేసుకుంటూ అన్నదమ్ములు ఎక్కుతున్న రిక్షాల్ని చూస్తున్నాడు దానయ్య. ''గురూ! మా దేశానికి వచ్చావేంటి? హైద్రాబాద్‌లో బిజినెస్ బాగాలేదా?'' అంటూ



# కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగా వుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

## ఋణం

సీనయ్య పలకరించేసరికి బాహ్య లోకంలోకి వచ్చాడు. అతనూ, సీనయ్య జైల్‌మేట్స్. జాయింట్‌గా అయిదారు దొంగతనాలు చేశారు. సీనయ్యని చూడగానే ప్రాణం లేచివచ్చింది దానయ్యకి. ఇద్దరూ పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ స్టేషన్ ఆవరణ దాటి వోవర్‌బ్రిడ్జి ఎక్కారు. సన్నసన్నగా తాను గుంటూరు వచ్చిన కారణం చెప్పాడు దానయ్య. "పెద్ద ప్లానులోనే వున్నావే... మనం వాళ్ళని బాగా వాచ్ చేయాలి... ఆ లాటరీ టికెట్‌ని కాజేయడం సులభమేగానీ కాష్ చేసుకోవడం కష్టం... పెద్దవాళ్ళ అండ వుండాలి... పది లక్షలా... మా బాస్‌కి చెప్తాను... అతనికి తెలిసిన పెద్ద తలలు చాలా వున్నాయి." అంటూ ఏదో చెబుతున్నాడు సీనయ్య.

*   *   *

నారాయణగారు రిటైరై ఆరు సంవత్సరాలు దాటింది. ముగ్గురు మొగపిల్లల్నీ, యిద్దరు ఆడపిల్లల్నీ పెంచి పెద్దచేసి చదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేయడానికి ఆయన సంపాదన సరిపోలేదు. పిత్రార్జితం అమ్మారు. చివరికి మూడు గదుల చిన్న పెంకుటిల్లూ, రెండు వంగల ఫించను, రోగిష్టి భార్యా ఆయనకి మిగిలారు. పిల్లలందరూ తలోచోటా వుంటూ తనకి పైసా సహాయం చేయకపోయినా కనీసం తన యోగక్షేమాలు విచారించకపోయినా ఆయన కినుక పడలేదు. ఎవరి కుటుంబాలు వారివి. ఎవరి కష్టాలు వారివి అని సర్దిచెప్పుకునేవారు. అయినా తాను కన్నవారిపై వున్న ప్రేమ తమని కన్నవారిపై వుంటుందా అని రాజీపడేవారు.

ఇప్పుడు ఆ యిల్లు పెళ్ళివారి యిల్లులా కళకళలాడుతున్నది. కొడుకులు, కోడళ్ళూ, కూతుళ్ళు, అల్లుళ్ళూ వాళ్ళ పిల్లలతో చాలా సందడిగా ఆనందంగా వుందా యిల్లు. కాని నారాయణగారు వంటింట్లో యింకా నిత్యపూజలోనే వున్నారు. ఆయన భార్య లక్షమ్మ మడితో వంట చేస్తున్నారు. ప్రతీవాళ్ళు వచ్చి ఆవిడ దగ్గర అటెండెన్స్ వేయించుకుని వెళ్తున్నారు.

గోవిందు, అన్నలకి తండ్రి రాస్తున్న పద్దు పుస్తకాన్ని, లాటరీ ఫలితాలు వేసిన ఆరు దినపత్రికల్ని చూపిస్తున్నాడు. ఇంటి ఖర్చుని చాలా వివరంగా రాసే అలవాటు వుంది నారాయణగారికి. రెండు నెలల క్రితం ఆయన కళ్ళజోడు క్రిందపడి పగిలింది. కొత్తది కొనాలనుకుంటూనే కాలక్షేపం చేస్తున్నారు. ఆయన ఖర్చు వివరాలు చెబుతూంటే లక్షమ్మ వ్రాసేవారు.

తల్లి రాసిన ఖర్చు వివరాలు చదువుతున్నాడు గోవిందు. "8–11–80 : కరెంట్ బిల్ సెప్టెంబరు : నెం. 88480 రూ 6–20. లాటరీ టికెట్ నెం. ఎఫ్ ఎల్ 00420; ఫలితం తేది 2–12–80. వెం రూపాయి. ఇంటి పన్ను బిల్ నెం. 4387 రూ 67–00 ... ఇక దినపత్రికల్ని చూడండి ... రిజల్ట్ చూడండి."

అందరూ ఆత్రతగా వింటున్నారు.

"అందరూ వచ్చేశారే...కేశవా ... అమ్మాయి రాలేదేం –" అంటూ వరండాలోకి వచ్చారు నారాయణగారు. అందరూ ఆయన చుట్టూ చేరి యోగక్షేమాలు తరిచి తరిచి విచారించారు.

"అది బైట చేరింది నాన్నా ... ఈ రోజే నీళ్ళు ... రేపటికల్లా వస్తుంది" అప్పటికే భార్యకి టెలిగ్రాం యిచ్చాడు కేశవరావు.

"మిమ్మలందర్నీ ఇలా చూస్తూంటే నాకు చాలా సంతోషంగా వుందిరా ... ఈ ప్రాణం ఇక పోయినా ఫరవాలేదు. నాకు పది లక్షల ప్రైజ్ ప్రతీనెలా వస్తే ఎంత బాగుంటుందో–" అంటూ కుర్చీలో కూర్చున్నారు. లంచాలు తీసుకోవడం, జూదం, లాటరీలు వొకే కోవకి చెందినవని ఆయన అభిప్రాయం. కష్టపడకుండా డబ్బు సంపాదించే మార్గాలంటే ఆయనకి ఏవగింపు ఎక్కువ. ఆయన ఆ రోజు లాటరీ టికెట్‌ని కొనేవారుకాదు. ఫించను తీసుకుని నోట్లు లెక్కపెడుతూంటే "సార్ ... 2–12–80న డ్రా సార్ ... పది లక్షల ప్రైజ్ సార్" అంటూ పన్నెండేళ్ళ కుర్రాడు వెంటపడితే మొదట్లో విసుక్కున్నారు. "మీరో టికెట్ తీసుకోండి సార్. లక్కీ నెంబరు 00420సార్... నేను వొక టికెట్ కూడా అమ్మకపోతే మా అయ్య అన్నంపెట్టడు సార్. నేను అన్నం తిని రెండు రోజులయింది–" అని వాడు అతిప్రాధేయపూర్వకంగా అర్థించేసరికి ఆయన కొంచెం జాలిపడ్డారు వాడి అవతారం చూసి. లోతుకుపోయిన కళ్ళూ, పది లంకణాలు చేసిన గొంతూ, మాసికలేసిన బట్టల్ని చూడగానే ఆయన చలించారు. రెండురూపాయలేకదాని వాడిపై దయతలిచి టికెట్ తీసుకున్నారు. వాడు పరుగులాంటి నడకతో ఆనందంగా వెళ్ళాడు. వాడి సంతోషం ఆయనకి బాగా సంతృప్తి నిచ్చింది. అసలు వాడి ఆనందానికి కారణం వూహించే స్థితిలో ఆయన లేరు. టికెట్ మాత్రం జేబులో వుంది. ఇంటికి వచ్చీరాగానే దాన్ని భద్రపరిచారు.

"కేశవా... మీ నాన్న ఎంత చిక్కిపోయారో చూశావా ? రెండు నెలల నుంచి కళ్ళజోడు లేకుండా కాలక్షేపం చేస్తున్నారు. మీ నాన్నకి చూపు బాగా మందగించింది. డాక్టర్ దగ్గరకి వెళ్ళండీ అంటే యింటిపన్ను కట్టాలి. వంట గదిలో సూర్యుడూ చంద్రుడూ వుంటున్నారు... పెంకులు మార్చి మళ్ళీ కప్పించాలని డబ్బుకూడ పెడుతున్నారు. లెక్కలు నేనే రాస్తున్నానుగా... పది రోజుల క్రితం మీ నాన్నకి జ్వరం వస్తే అందరికీ ఉత్తరాలు రాశాను... ఎవరూ రాలేదు. కనీసం కార్డుముక్క కూడా రాయలేదు. పది లక్షలు వచ్చేసరికి మీకు ప్రేమలు పుట్టుకువచ్చాయి" అంది నిష్ఠూరంగా, బాధగా, కోపంగా లక్షమ్మ.

"మీ ఉత్తరం నాకు అందలేదమ్మా" అంటూ అబద్ధాన్ని గట్టిగా చెప్పాడు కేశవరావు. అతనప్పుడు ప్రమోషన్ హడావిడిలోవుండి, జ్వరమేగా! తగ్గిపోతుందని నిర్లక్ష్యం చేశాడు.

"నాకు శెలవు దొరకలేదమ్మా –" అంటూ మాటల్ని నాన్చాడు మాధవ.

"అవును అత్తయ్యగారూ ... అప్పుడు మీ అబ్బాయికి ఆఫీసు ఇన్‌స్పెక్షన్" అంటూ వత్తాసు పలికింది అతని భార్య.

# ఋణం

"అత్తయ్యగారూ... మీ అబ్బాయి రాకపోవడానికి కారణం నేనే. నాకు నెల రోజులు నుంచి వెన్నులో నెప్పి. గుండెల్లో మంట. బలహీనత... నాకు మందులూ, యింటి పనులు, షావుతోనే మీ అబ్బాయికి సరిపోయేది —" అంటూ అందమైన అబద్ధాలు చెప్పే గోవిందు భార్య అతను వెళ్ళానంటే... మీరెందుకండి వెళ్ళడం... మీకన్నా యిద్దరు పెద్దాళ్ళు వున్నారు. బాగా సంపాదిస్తున్నారు... వాళ్ళు చూసుకుంటారని... అనవసరపు ఖర్చు ఎందుకని గదమాయించింది.

"నేను వచ్చేవాణ్ణే అత్తయ్యగారు ... పల్లెటూళ్ళో ప్రాక్టీసు. ఒక్క రోజు యింటివగ్గర లేకపోతే జనం గగ్గోలుపెడతారు...మీరు ఆ రోజుల్లో నా కట్నం తాలుకు డబ్బంతా యిచ్చివుంటే ఈ వూళ్ళోనే హాయిగా ప్రైవేట్ ప్రాక్టీసు పెట్టేవాణ్ని —" అంటూ లౌక్యంగా మాట్లాడుతున్న ఆ ఇంటి పెద్దల్లుడు ఆర్. ఎమ్. పి.గా పనిచేస్తున్నాడు.

"నాన్నా ... నువ్వేం అనుకోనంటే వొక మాట ... మీ అల్లుడిగారికి రాకరాక వొక కేసు వచ్చింది. మీకు జ్వరంగా వుందని తెలిసిన రోజుల్లోనే ఆయన కోర్టుకి వెళ్ళవలసి వచ్చింది. ఆ కేసు ఏమిటో తెలుసా నాన్నా. తండ్రి ఆస్తిలో కూతుళ్ళకి హక్కువుంది —" అంటూ అల్లిబిల్లి కథలు చెబుతూ తన అసలు కథని నర్మగర్భంగా దాచింది రెండో కూతురు. ఆవిడ భర్త ప్రాక్టీసులేని లాయర్.

"గతం గతః...ప్రస్తుత సంగతి ఆలోచించండి. లాటరీ టికెట్ నా దగ్గరవుంది. బొంబాయి వెళ్ళాలి. నా దగ్గర నయాపైసా లేదు ... మన కుటుంబ సభ్యులు అందరం కలిసి బొంబాయి వెళ్ళి ఆ డబ్బు తీసుకుని దాంతో ముందు ఈ దేశాన్నంతా తిరగాలని నాకుంది" అంటూ తన ఎదలోని కోరికని వ్యక్తపరిచారు నారాయణగారు.

"బ్రహ్మాండంగా వుంది నాన్నా మీ ప్లాను ... నేనో నెలరోజులు శెలవు పెడతాను ..." అంటూ అందుకున్నాడు కేశవరావు.

"అయిడియా బ్రహ్మాండంగానే వుంది ... బొంబాయికి మనందరం వెళ్ళి అక్కడ వారం పదిరోజులు వుండాలంటే కనీసం నాలుగువేలు కావాలి ..." అంటూ సంశయం వెలిబుచ్చారు.

"ఆ ఖర్చు మాకు వదిలేయండి—" అంటూ ముందుకు వచ్చారు అల్లుళ్ళు, మావగార్ని మంచి చేసుకోవాలనే ధోరణిలో.

"నాన్నా! ముందు కళ్ళజోడు తీసుకుందాం పద ... డాక్టర్ దగ్గరికి వెళ్దాం" అంటూ తొందర చేశాడు గోవిందు.

"అలా చూస్తూ వూరుకుంటారేమిటండీ — ఈ చలికాలంలో ఈ ఇంట్లో ఎలా వుండగలం ? వెంటనే మంగుళూరు టైల్స్ తెప్పించి..." మాధవస్వామి భార్య గొంతు విప్పి ఏదో అంటున్నది.

"మేం టికెట్లు తీసుకుంటాం —" అంటూ అల్లుళ్ళు లేచారు.

"మీ యిష్టం ... అరేయ్ మాధవా ... ఇంటి సంగతి కొంచెం చూడరా ... గోవిందూ డాక్టర్ దగ్గరకి వెళ్దాం" అని నారాయణగారు అంటూంటే కేశవరావు కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

* * *

ఎక్కువ వడ్డీలకి ప్రోనోట్లు రాసి అప్పులు తెచ్చి బొంబాయి ప్రయాణానికి బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేస్తున్నారు ఆ యింటి అల్లుళ్ళు. నిలువుదోపిడి నగల్ని తాకట్టుపెట్టి సిమెంట్, ఇసుకా, పెంకులూ వగైరాలు తీసుకుని యింటిపని చేయిస్తున్నాడు మాధవ. డాక్టర్ రాసిన మందులూ, కళ్ళజోడు కొని చేతులు కడుక్కున్నాడు గోవిందు. చేతులు ముడుచుకుని కూర్చోకుండా ఆ యింటి పెద్దకొడుకులా కర్రపెత్తనం చేస్తున్నాడు కేశవరావు.

దానయ్యా, సీనయ్య ఆ యింటిమీద కన్నేసి ఎప్పటికప్పుడు విషయాల్ని సేకరిస్తున్నారు. వాళ్ళ బాస్‌కి రిపోర్టు చేస్తున్నారు. లాటరీ టికెట్ ఎక్కడుందో, ఎవరిదగ్గరుందో వాళ్ళకి అంతుబట్టడం లేదు.

ఆ రోజు నారాయణగారి కుటుంబం బొంబాయి వెళ్తున్నదని తెలిసి వాళ్ళ యింటిముందే తచ్చాడసాగారు చోరద్వయం. నారాయణగారి యిల్లు చాలా హడావిడిగా వుంది. లాటరీ టికెట్‌ని చూడాలని అందరికీ వుంది. కాని ఆయన్ని అడగాలంటే భయం. చివరికి ధైర్యం చేశాడు కేశవరావు. "రెప్పపాటు కాలంలో దొంగతనాలు జరుగుతున్నాయి నాన్నా... మన జాగ్రత్తలో మనం వుండాలని అడుగుతున్నాను. ఎక్కడ దాచావు నాన్నా."

"పంచాంగంలో పెట్టారా..." అంటూ అల్మారాలోంచి పంచాంగాన్ని తీశారు. పంచాంగం పేజీలు తిరగేసి లాటరీ టికెట్‌ని తీశారు. చూశారు. కళ్ళజోడు లేకుండా చూశారు. టికెట్‌మీది అంకెలు మసక మసకగ్గా కనబడ్డాయి. కళ్ళజోడు పెట్టుకుని చూశారు... ఆ కుర్రాడు, ఆ లాటరీ టికెట్లు అమ్మే కుర్రాడు ఎందుకు నవ్వుకుంటూ పోయాడో ఆయన కిప్పుడు అర్థమయింది. ఆయన వొళ్ళు తూలింది.

"కేశవా... మాధవా... గోవిందా" అన్నారు బలహీనంగా నారాయణగారు.

"ఏమిటి నాన్నా... నాన్నా... నాన్నా..." అంటూ తండ్రిని పట్టించుకోకుండా లాటరీ టికెట్‌ని చూస్తున్నారు. కొడుకులు...కూతుళ్ళు... అల్లుళ్ళు... ఆ టికెట్ చేతులు మారుతున్నది.

**రచయితలకి మనవి**

★ కాగితానికి ఒక వైపునే సిరాతో రచనలు వ్రాసి పంపవలసిందని అన్నిరకాల రచనలు పంపే రచయితలకి మరోసారి మనవి చేస్తున్నాము.

★ గేయాలు, కార్టూన్‌లు చాలా యెక్కువ సంఖ్యలో మా కార్యాలయం చేరుతూంటాయి కనుక వీటి పరిశీలన వెన్వెంటనే జరుగదు. — సం॥

మెరుపులా ఆ టికెట్‌ని చేజిక్కించుకున్నాడు దానయ్య. అతన్నెవరూ గమనించలేదు. కేశవరావుకి యాదగిరి కనబడుతున్నాడు. గోవిందుకి ఋషి యిచ్చిన పత్రికా ప్రకటన కనబడుతోంది. తల విమురుకుని వేంకటేశ్వరస్వామి ఫోటో వంక చూశాడు మాధవ. అల్లుళ్ళు జేబురుమాళ్ళు ముఖాలపై వేసుకున్నారు. వాళ్ళ భార్యలు కటికనేలమీద చతికిలబడ్డారు. పిల్లలు బొంబాయి ప్రయాణం గురించి కబుర్లు చెప్పుకుంటున్నారు. దానయ్యని ఎవరూ పట్టించుకోలేదు. అతన్ని వెంబడించలేదు. సీనయ్య మాత్రం అతిమరుగ్గా దానయ్య కాళ్ళకి బ్రేకులు వేసి క్రిందపడేసి ఆ లాటరీ టికెట్‌ని లాక్కుని పరిగెత్తాడు.

"ఏమిటండీ ఇలా అయిపోయారు ? అసలేం జరిగింది ? లాటరీ టికెట్‌ని తీసుకుని వాడు పరిగెడుతూంటే ఎవరూ వెంటపడరేం...అదేంటండీ అలా చూస్తారు ? నాకేదో భయంగా వుంది కేశవా... మాధవా... గోవిందా... రండిరా... మీ నాన్న..." లక్ష్మమ్మకి మాటలు రావడంలేదు.

సర్రుమని సెడన్‌బ్రేక్‌తో సీనయ్య పక్కనే ఆగింది కారు. "ఏమిటీ విషయం" అన్నాడు కారులోని సూట్‌వాలా.

"టికెట్ దొరికింది సార్" అన్నాడు సీనయ్య.

"ఏదీ... లోపలికిరా" కారు డోర్ తెరిచాడు సూట్‌వాలా — గుప్పెట్లోని టికెట్‌ని చూపిస్తూ కారు ఎక్కబోయాడు.

టికెట్ చేతులు మారింది. రివ్వుమని కదిలింది కారు. డోర్ సీనయ్యని వెనక్కి నెట్టింది. అతను వెల్లకిల్లా రోడ్డుమీద పడ్డాడు.

"ఎందుకే అలా ఏడుస్తావ్ ? ఈవేళ కాకపోయినా రేపైనా నా ప్రాణం పోవలసినదే. నా అనేవాళ్ళు దగ్గర లేనప్పుడు చనిపోతానేమోనని గతంలో చాలాసార్లు బాధపడ్డాను. ఇప్పుడు నాకేం లోటు లేదు. బాధలేదు. అందరూ నా దగ్గరే వున్నారు. కొడుకులూ, కోడళ్ళు, కూతుళ్ళూ, అల్లుళ్ళు, వాళ్ళ పిల్లలు... యింతకన్నా నాకేం కావాలి. నా ప్రాణం పోయినా ఫరవాలేదు. ఆ లాటరీ కుర్రాడు నన్ను మోసం చేసినా వాడికెంతో ఋణపడి వున్నాను..." అంటున్న నారాయణగారి ప్రాణం గాలిలో దీపంలా వుంది. అందరూ ఆయనచుట్టూ చేరారు. వాళ్ళ ఋణం తీరిపోయింది. ఆయన కన్ను మూశారు.

హోటల్ రూంకి వచ్చి సూట్‌వాలా బాస్‌కి ఫోన్ చేశాడు. "గుడ్ న్యూస్ బాస్ ! టికెట్ మన చేతికి వచ్చింది."

"అగ్గిపుల్లతో దాన్ని వెలిగించి సిగరెట్ కాల్చుకో. రెండు వేలు తగలేసి ఇనఫర్మేషన్ బొంబాయి నుంచి తెప్పించాను. 2—12—80న డ్రా చేసిన పది లక్షల ప్రైజ్‌ని ఎవరో తీసుకున్నారుట. నీ దగ్గరున్నది అసలైన టికెట్ కాదు —" అంటూ చెడామడా తిడుతున్నాడు బాస్.

లాటరీ టికెట్‌ని పునః పునః చూశాడు సూట్‌వాలా. దానిమీద డ్రా తేదీ 2—12—79 అని వుంది. అతని తల గిర్రున తిరిగింది. గుమ్మం ముందు సీనయ్యా, దానయ్య నిల్చున్నారు. బాకీదారుల్లా నిల్చున్నారు. ★